



అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 08 జూలై 2025 పేజీలు : 04


# ప్రతి ఇంటిలో ఒక ఎంటర్ ప్రెన్యూర్ ఉండాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం

**- అందుకు అనుగుణంగానే జెఎన్‌టియులో రతన్ టాటా ఇన్నోవేషన్ స్పోక్**

**- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**



విసి సుదర్శన్‌రావ్‌తో సమావేశమైన ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం కలెక్టరేట్, జూలై 7 ప్రభాతవార్త**

ప్రతి ఇంటిలో ఒక ఎంటర్ ప్రెన్యూర్ వుండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో భాగంగా అనంతపురం జెఎన్‌టియులో ఏర్పాటు కాబోతున్న స్పోక్ సెంటర్‌పై ఆయన విసి సుదర్శన్‌రావ్‌తో సోమవారం సమావేశమయ్యారు. అనంతపురం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విసితో స్పోక్‌కు సంబంధించిన అంశాల గురించి చర్చించారు. ఇప్పటికే స్పోక్‌కు ప్రభుత్వం 30 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసింది. సెంటర్ ఏర్పాటుపై ఎమ్మెల్యే దగ్గుపాటి చర్చించారు. ప్రధానంగా ఎక్కువ మంది యువతకు అవకాశం కల్పించే విధంగా ఈ సెంటర్ వుండాలని ఆయన జెఎన్‌టియు విసిని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ 2047లో భాగంగా అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతపురం జెఎన్‌టియులో ఒక స్పోక్‌ను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్, స్టార్టప్‌ల ప్రోత్సాహం కోసం ఈ స్పోక్ ఒక కేంద్రంగా పనిచేయనుందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించడం, వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం వంటివి జరుగుతాయన్నారు. ఈ ప్రాజెక్టులో గ్రీన్‌కో ఎనర్జీ, ఎన్‌జిసి, జిఎఐఎల్, అవంతి గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలు గవర్నింగ్ కమిటీలో భాగస్వాములుగా వున్నాయన్నారు. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం ద్వారా ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అత్యంత కరువు జిల్లాగా వున్న అనంతపురంలో ఈ కేంద్రం ఏర్పాటు కావడం సంతోషంగా వుందన్నారు. త్వరలోనే దీని కార్యకలాపాలు కూడా ప్రారంభం అవుతాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు..!




❖ పైసలిస్తే బెల్ట్ షాపులకు పర్మిషన్....

❖ పైసలు ఇవ్వకుంటే దాడులతో పరేషాన్...!

❖ ఐదేళ్ల తర్వాత ఎక్సైజ్ శాఖలో అంతులేని అవినీతి...!

**ధర్మవరం, జూలై 7 (ప్రభాతవార్త)**

ధర్మవరం నియోజకవర్గంలో మద్యం షాపులు ఆశాఖకు కనక వర్షాలు కురిపిస్తున్నాయి. ఎక్సైజ్ శాఖలో అవకాశం వచ్చిందే తడువు వసూళ్లలో మునిగి తేలిపోయారు ఆ శాఖ అధికారులు . పైకి మాత్రం ఒక్క పైసా ఆదాయం లేదంటూ నటిస్తూనే అక్రమార్జనలో కోట్లకు పడగలెత్తేశారు. చిన్నషాపు నుంచి పెద్ద షాపు వరకు ఎవరిని వదలడంలేదు. అంతెందుకు నేరుగా వెళ్లి బెల్టుషాపులు నిర్వహించుకుంటామని లోపాయి కారీ ఒప్పందాన్ని కుదుర్చుకుంటే క్షణాల్లో అనధికార అనుమతులు అట్టే లభిస్తాయి. చివరికి మద్యంషాపుల సమీపంలో గ్లాసులు, స్నాక్స్ అమ్ముకునే వారిని కూడా వదలడం లేదు. ఈ లెక్కన ప్రతినెల ఆ శాఖలో పనిచేస్తున్న ముఖ్య అధికారిణి ఆదాయం అక్షరాల రూ.22లక్షల పైమాటే. ఈ అక్రమార్జనలో కింది నుంచి పైస్థాయి వరకు వాటాల రూపంలో వెళ్తుంటాయని ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖను తమ దరిదాపుల్లోకి రానివ్వకుండా అప్పటి ప్రభుత్వ పెద్దలు మద్యం కుంభకోణానికి పాల్పడగా ప్రస్తుతం అధికారం మారడంతో ప్రస్తుతం ఆశాఖ అధికారులకు కల్పతరువుగా మారింది. ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 19 మద్యం షాపులుండగా ఒక్కొక్క షాపు 5 నుండి 6 బెల్టుషాపులు చొప్పున ఆ ఎక్సైజ్ ఉన్నతా అధికారిణి అనధికారిక అనుమతులు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. వీటితో పాటు డాబాల నిర్వాహకుల నుంచి కూడా భారీ ఎత్తున అక్రమ వసూళ్లకు ఒడిగట్టడంతో వారి అక్రమార్జన మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోందని కొందరు మద్యం వ్యాపారులే బాహాటంగా వ్యక్తం చేస్తుండటం విశేషం.

**ప్రతినెల అక్రమ వసూళ్లు రూ.22లక్షల పైమాటే**

ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా 19 మద్యంషాపులు నడుస్తుండగా వీటి ద్వారా 95 నుంచి 115 దాకా బెల్ట్ షాపులు అనధికారికంగా నిర్వహించడానికి ఎక్సైజ్ శాఖ ధర్మవరం అధికారిణితో లోపాయికారీ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు తెలుస్తోంది. ఇదే కాకుండా డాబాల నుంచి కూడా బారీ ఎత్తున అక్రమార్జనకు పాల్పడుతుండటంతో ఐదేళ్ల తరువాత కాసుల వర్షంలో మునిగితేలుతున్నారు ఎక్సైజ్ శాఖ అధికారులు. ఒక్కో మద్యం షాపు నుంచి రూ.60నుండి 80వేలు, బెల్టుషాపు నుంచి రూ.3వేల నుంచి రూ.8వేల దాకా వసూళ్ల చేస్తుండగా ఒక్కొక్క డాబా నుంచి రూ.25వేలు ముక్కుపిండి వసూళ్ల చేస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఎవరైన మద్యంషాపు పక్కన గ్లాసులు, స్నాక్స్ అమ్మకాలు నిర్వహిస్తున్నా నెలవారి లంచాలు ఇచ్చుకోవాల్సిందేనట. అందుకు ఎవరైన షసేమిరా అన్నా అక్రమ మద్యం అమ్ముతున్నారంటూ కేసులు బనాయిస్తుండటంతో చేసేది ఏమీలేక వారు అడిగినంత ఇచ్చి అమ్మకాలు నిర్వహించుకునే పరిస్థితి నెలకొంది. ఈ లెక్కన దాదాపు ఒక్క ధర్మవరం నియోజకవర్గం నుంచే రూ.22లక్షల దాకా ఆదాయం సమకూరుతున్నట్లు ఆ శాఖ వర్గాలే పేర్కొనడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇదేమని కొందరు మద్యంషాపు నిర్వాహుకులు ప్రశ్నిస్తే ఇందులో మాకేమి వస్తుందని పై స్థాయి వరకు పంపాలి. ఇక్కడ మాత్రం నిందలు పడుతున్నామే కానీ మిగిలేది అంతంత మాత్రమే నంటూ నిట్టూర్పును వదులుతున్నారు.

**అక్రమార్జనలో పోలీస్ స్టేషన్లకూ ప్రత్యేక వాటా :**

మద్యంషాపుల ద్వారా కొన్ని స్థానిక పోలీసు స్టేషన్లకు ప్రత్యేక వాటా అందుతోందని విశ్వసనీయ సమాచారం. ఆయా పోలీస్టేషన్ పరిధిలో ఉండే మద్యం షాపుల ద్వారా నెలవారి వసూళ్లు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక్కో మద్యం షాపు ద్వారా రూ.20 వేలు నెలవారి అందుతుండగా నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపుల ముందు ఎవరైనా వ్యవహరిస్తే స్థానికపోలీసులకు పండగే పండగ. లేనిపోని నిబంధనలు చూపుతూ మద్యంప్రియులను లేదా షాపు నిర్వాహకులను స్టేషన్కు పట్టుకొస్తే వారి జేబులు నింపందే బయటకు పంపని పరిస్థితి కూడా స్థానిక పోలీసులలో లేకపోలేదు.

**ఆదాయం లేక అల్లాడుతున్నాం : షాపు నిర్వాహకులు**

పోటీ పడి మద్యం షాపులు దక్కించుకున్నామన్న సంతోషం ఏర్పాటు మొదటిలో మా ఆశలు ఆవిరైపోయాయి. తగిన వ్యాపారం లేకపోవడంతోపాటు ప్రభుత్వం ఇచ్చే కమీషన్ ఏమాత్రం చాలడంలేదని దీంతో నష్టాలలో నడిపే పరిస్థితిఏర్పడుతోందని మద్యం షాపుల నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. ప్రతి షాపు నుంచి రూ. 3లక్షల వ్యాపారం అయితే తప్ప మాకు మిగులుబాటు ఉండదని అలా నడిచే దుకాణాలు నియోజకవర్గవ్యాప్తంగా ఎక్కడా లేవని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం కమిషన్ రూపంలో ఇచ్చే 14శాతం ఏ మాత్రం సరిపోలేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారాలు లేక బారీగా నష్టపోయి చేసేది లేక కొందరైతే ఆ దుకాణాన్ని వదులుకుని మరొకరికి అప్పచెప్పారని పలువురు పేర్కొంటున్నారు. ధర్మవరం పట్టణంలో గతంలో 9 షాపులుండగా కొంతమేర వ్యాపారం జరిగేదని వాటిని 13 షాపులకు పెంచడం వల్ల వ్యాపారం పూర్తిగా తగ్గిపోయిందని పలువురు మద్యం షాపు నిర్వాహకులు పేర్కొంటున్నారు.

**విచారణ చేసి చర్యలు తీసుకుంటాం: నాగమద్దయ్య, అనంతపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ :**

ధర్మవరం నియోజకవర్గంలో మద్యం షాపులకు అనుసంధానంగా బెల్ట్ షాపులను ప్రోత్సహించడం ఏమాత్రం సహించమని తప్పకుండా బెల్ట్ షాపులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అంతేకాకుండా మద్యంషాపులు, బెల్టుషాపులు, డాబాల వద్ద నుంచి అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి రాలేదని. అలాచేస్తున్నట్లు మా దృష్టికి వస్తే విచారణ చేసి చర్యలు చేపడతామన్నారు.

# మరో 30 సంవత్సరాలు తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు..!



పీఏబీఆర్‌లోని పంప్‌హౌస్‌లో స్విచ్ ఆన్‌చేసి మోటార్లను ప్రారంభిస్తున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



ఉరవకొండలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణంలో తాగునీటి పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్



సభలో ప్రసంగిస్తున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**- నిర్లక్ష్యానికి గురైన ఉరవకొండ తాగునీటి వ్యవస్థను గాడిలో పెడుతున్నాం**

**- ఉరవకొండలో రోజు విడిచి రోజు నీటిని ఇచ్చే బాధ్యతను నేను తీసుకొంటున్నాను : మంత్రి పయ్యావుల కేశవ్**

**- జేజేఎం కింద రూ.16.35 కోట్లతో నిర్మించిన పైప్‌లైన్, సంపు ప్రారంభించిన మంత్రి**

**- జనవరి 1న భూమి పూజచేసి జూలై 7 ప్రారంభిస్తుండటం ఒక చరిత్రని వ్యాఖ్య**



మహిళలతో మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, జూలై 7 ప్రభాతవార్త**

ఉరవకొండ ప్రజలకు మరో 30 సంవత్సరాలపాటు ఎలాంటి తాగునీటి సమస్య రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకొంటున్నామని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఉరవకొండలో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించడంలో భాగంగా జల్‌జీవన్ మిషన్ నిధులు 22 కోట్ల రూపాయలతో చేపట్టిన రక్షిత మంచినీటి పథకంలో భాగంగా 16.35 కోట్ల రూపాయల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన కూడేరు మండలం ఉదిరిపికొండ-ఉరవకొండ తాగునీటి పైప్‌లైన్, ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణంలో నిర్మించిన 4 లక్షల లీటర్ల సామర్థ్యంగల సంపును సోమవారం ఆయన శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రసంగించారు. నిర్లక్ష్యానికి గురైన తాగునీటి వ్యవస్థను గాడిలో పెడుతున్నామన్నారు. గత ప్రభుత్వంలో పక్షం, నెలరోజులకు ఒకసారి నీళ్ళు వచ్చే పరిస్థితులు ఉండేవని ఆ పరిస్థితిని చక్కదిద్దాలని నూతన పైప్‌లైన్, సంపు నిర్మాణానికి ఈ ఏడాది జనవరి 1న భూమిపూజచేసి జూలై 7న ప్రారంభించుకోవడం చారిత్రాత్మకమన్నారు. ఉరవకొండ తాగునీటి పథకాల అభివృద్ధికి ఏం చేసినా తెలుగుదేశం ప్రభుత్వంలో తానే చేశానన్న మంత్రి పయ్యావుల కేశవ్ నింబగల్లు సీపీడబ్ల్యూ స్కీమ్‌లో 3వ నమ్మర్ స్టోరేజీ ట్యాంకు, పీఏబీఆర్ నుండి కౌకుంట్ల మీదుగ పైప్‌లైన్, పీఏబీఆర్ నుండి ఉదిరిపికొండకు పైప్‌లైన్ తానే తీసుకొచ్చానన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీఏబీఆర్‌లో ఒక్కరోజు కూడా నీటిని శుభ్రం చేసిన దాఖలాలే లేవని వాటినన్నింటినీ నేడు శుభ్రంచేసి రీస్టార్ట్ చేస్తున్నామన్నారు. నింబగల్లు వద్ద సీపీడబ్ల్యూ స్కీమ్‌ను నిర్లక్ష్యం చేశారని స్లో స్యాండ్ వాటర్ ఫిల్టర్లు పూర్తీ పాడైపోయినా పట్టించుకోలేదని దీంతో అక్కడ మైక్రో ఫిల్టర్లను ఏర్పాటు చేశామని స్వచ్ఛమైన నీటిని అందించే బాధ్యత తనదన్నారు. ఉరవకొండ ప్రజలకు పని చేసేవారికే పట్టం కడుతారని మొన్న జరిగిన ఎన్నికల్లో మరోమారు నిరూపణ అయిందని మీరు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకొని తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నానన్నారు. చేయాల్సినవి, బాధ్యతలు చాలా ఉన్నాయని ఒక వైపు తాగునీటి వ్యవస్థను గాడిలో పెడుతూనే మరో వైపు పారిశుద్ధ్యం మెరుగు, ఇంటి పట్టాల సమస్య, కూరగాయల మార్కెట్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఓట్లు వేసి ఆదరించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నానని పనిచేసే వ్యక్తి ఎమ్మెల్యేగా ఉంటే ఎలా ఉంటుందో, పని చేయని అసమర్థుడు ఎమ్మెల్యేగా ఉంటే ఎలా ఉంటుందో ప్రజలు తెలుసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ళలో ఒక్క రోడ్డు కూడా వేయలేదన్న మంత్రి కొత్తగా తాము 15 రోడ్డు వేయిస్తున్నామని ఈనెలలోనే అన్ని పనులు ప్రారంభిస్తున్నామన్నారు. ఉరవకొండలో రోజు విడిచి రోజు నీటిని అందించే బాధ్యతను తాను తీసుకుంటున్నానని ప్రభుత్వం ఒక మనిషికి 55 లీటర్ల నీళ్ళు ఇవ్వాలని నిర్ణయిస్తే తాను 110 లీటర్లు ఇచ్చే వ్యవస్థలను సిద్ధం చేస్తున్నానన్నారు. తాను ఎక్కడున్నా నా ఆలోచనంతా ఉరవకొండపైనే ఉంటుందని రాజకీయంగా ఇనేళ్ళుగా ఆదరిస్తూ వస్తున్న ప్రజలకు పెద్ద కొడుకుగా పని చేస్తానని పయ్యావుల కేశవ్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఆర్.సురేష్, డీఈఈ ఎం.అంజుమన్ సఫ్రీన్, ఏఈ కె.సి.ఐజయ్య, తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఎంపీడీవో బి.వి.రవి ప్రసాద్, టీడీపీ నాయకులు ఎస్.విజయభాస్కర్, రేగాటి నాగరాజు, దేవినేని పురుషోత్తం, ప్యారం కేశవానంద, మోపిడి గోవిందు, కె.సీతారాములు, వి.సుంకరత్నమ్మ, పి.రాజేష్, బి.సి.మారెన్న, కె.జె.కుళ్లాయప్ప, యర్రగుంట్ల వెంకటేష్, జనసేన ఇంచార్జ్ గౌతమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మెగా పీటీఎం విజయవంతంకు కసరత్తు...!

**- కలెక్టరేట్ ఎన్ఐసిలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు - సోమవారం నుండి గురువారం వరకు అక్కడే**

**- 10న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పీటీఎం - జిల్లా కలెక్టర్ డా.వి.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ**





కమాండ్ కంట్రోల్ రూంలో ఫోన్లు చేస్తున్న విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు, ఉద్యోగులు

**అనంతపురం న్యూటౌన్, జూలై 7 ప్రభాతవార్త**

ఈనెల 10వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్‌ను విజయవంతం చేయడానికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కసరత్తు చేస్తున్నారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసిలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష, ఆర్ఐవో, డీఈవో కార్యాలయాల అధికారులు, ఉద్యోగులతో హెచ్ఎంలు, ప్రిన్సిపాల్స్‌కు ఫోన్లు చేసి ఏర్పాట్లుపె ఆరా తీస్తున్నారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 4215 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, 96 జూనియర్ కళాశాలల్లో ఈనెల 10వ తేదీ మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ 2.0ను నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 4,37,777 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనను న్నారు. గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకునేలా విద్యాశాఖ ప్రణాళికలు రూపొందించింది. ఆ విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని హెచ్ఎంలకు, ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఆయా మండల ఎంఈవోలు, డీవైఈవోలు కూడా మెగా పీటీఎం ఏర్పాట్లను పర్యవేక్షణ చేసి విజయవంతం చేయడానికి చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ డా.వి.వినోద్‌కుమార్ కూడా జిల్లా విద్యాశాఖ, ఆర్ఐవో, డీవీఈవో, సమగ్రశిక్ష అధికారులు, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులతో సమావేశం నిర్వహించి మెగా పీటీఎంను జయప్రదం చేయాలని ఆదేశించారు. అలాగే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి కలెక్టరేట్‌లోని ఎన్ఐసిలో కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు, ఏపీసీ శైలజ, ఆర్ఐవో, డీవీఈవోలు తన సిబ్బందితో కలిసి సోమవారం ఉదయం 8గంటల నుండి కలెక్టరేట్‌లోనే ఉండి జిల్లాలోని హెచ్ఎంలు, ప్రిన్సిపాల్స్‌కు ఫోన్లు చేసి మెగా పీటీఎంకు ఏర్పాట్లు పై ఆరా తీస్తున్నారు. మెగా పీటీఎం కార్యక్రమం ముగిసే వరకు (గురువారం) అక్కడే ఉండి ఏర్పాట్లుపై పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లుపై ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష, ఆర్ఐవో, డీవీఈవో కార్యాలయాల అధికారులకు ఫోన్లు చేసి నివృత్తి చేసుకోవాలని డీఈవో ఎం.ప్రసాద్ బాబు తెలిపారు.

**మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ కార్యక్రమం :**

ఈనెల 10వ తేదీ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ జరుగునుంది. ఆ తర్వాత ఆయా నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారు. అలాగే విద్యార్థులకు హోలీస్టిక్స్ ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేయనున్నారు. ఏక్ పేడ్-మాకే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమం కింద మొక్కను నాటాలి. ప్రతి ఒక్క విద్యార్థులకు ఒక గ్రీన్ పాస్ పోర్టు ఇవ్వనున్నారు. ఒక్కొక్కరు ఒకటి నుండి మూడు మొక్కలు దత్తత తీసుకోవాలి. తల్లిపాదాలకు వందనం చేసి మొక్కను నాటి, అది మాను అయ్యేవరకు కాపాడాలి. ఈ కార్యక్రమాన్ని డాక్యుమెంటేషన్ కూడా చేస్తున్నారు. ఇందుకోసం 30 సెకండ్ల వీడియో క్లిప్, మూడు ఫోటోలు అప్‌లోడ్ చేసేలా డాక్యుమెంట్ చేసి జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనేలా జిల్లా విద్యాశాఖ ప్రణాళికలు రచించింది.

# ఓడి చెరువుకు 132-33 కెవి సబ్ స్టేషన్ మంజూరు

**- ప్రధానమంత్రి సూర్యఘర్‌ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోండి**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ కె.సంపత్‌కుమార్

**కదిరి, జూలై 7 ప్రభాతవార్త**

కదిరి విద్యుత్ డిఈ కార్యాలయ పరిధిలోని ఓడి చెరువుకు 132-33 కెవి సబ్ స్టేషన్ మంజూరు అయినట్లు సత్యసాయి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ తెలిపారు. సోమవారం విద్యుత్ శాఖ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కృషి వల్ల..ఓడి చెరువు మండలానికి మంజూరైన 132-33 కెవి సబ్ స్టేషన్ వల్ల ఓడి చెరువు, అమడగూరు, నల్లమాడ, కదిరి రూరల్ పరిధిలోని వివిధ గ్రామాలకు లో ఓల్టేజీ సమస్య నివారించడంతోపాటు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. కోతలు లేని విద్యుత్, నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా విద్యుత్‌శాఖ పని చేస్తుందని, జిల్లా వ్యాప్తంగా ఏ గ్రామంలో కూడా లో ఓల్టేజీ సమస్య ఉండకూడదన్నారు. మంజూరైన సబ్ స్టేషన్‌కు ట్రాన్స్‌కో శాఖ నుంచి రూ.20 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని, త్వరలోనే ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రితో కలిసి స్థల సేకరణ చేసి, పనులు వేగవంతంగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమకు నేరుగా తెలిపితే సత్వరమే చర్యలు చేపడుతామన్నారు. త్వరలోనే అవసరమైన చోట్ల కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం చేపడుతామన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా, ప్రజలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాల న్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా నామమాత్రపు ఖర్చులతో సోలార్ ప్యానల్‌ను తమ ఇండ్లపై ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. ఇందుకు ప్రభుత్వ సబ్సిడితో పాటు బ్యాంకులు, రుణాలు మంజూరు చేస్తాయని, సోలార్ పథకంతో ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గృహ అవసరాలకు వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ శాఖకు విక్రయించి ఆదాయం పొందవచ్చున్నారు. ప్రధానమంత్రి కుసుమ స్కీం కింద పొలాల్లో నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగించుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం రాయితీ కింద ఏర్పాటు చేస్తోందని వివరించారు. ఇతర వివరాలకు ఆయా డివిజన్ల పరిధిలోని విద్యుత్ కార్యాలయాల్లో ప్రజలు, రైతులు సంప్రదించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ కోరారు.

# అనంతపురం సర్కిల్-2 సీటీవోగా రాకేష్ బాధ్యతలు స్వీకరణ



**అనంతపురం న్యూటౌన్, జూలై 7 ప్రభాతవార్త**

వాణిజ్య పన్నుల శాఖలోని అనంతపురం సర్కిల్-2 సీటీవోగా కూన రాకేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సీటీవో నరసింహులు నెల్లూరు జిల్లా మర్కాపురం సర్కిల్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కాకినాడ డివిజన్‌లోని పెద్దాపురం సీటీవోగా పనిచేస్తున్న కూన రాకేష్‌ను బదిలీ చేశారు. అందులో భాగంగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన సీటీవో వార్తతో మాట్లాడుతూ తనది శ్రీకాకుళం జిల్లా అని, తాను ఏయూలో బిటెక్ పూర్తి చేశానని, సివిల్స్‌కు సన్నద్ధం అవుతుండగా డైరెక్ట రిక్రూట్‌మెంట్ ద్వారా గ్రూప్-1 ఆఫీసర్‌గా ఎంపికై సీటీవోగా కాకినాడ డివిజన్ పెద్దాపురంలో 2023 అక్టోబర్‌లో మొదట సారి ఉద్యోగంలో జాయిన్ అయ్యానని తెలిపారు. తాజాగా జరిగిన బదిలీల్లో అనంతపురం సరి ్కల్-2 సీటీవోగా బదిలీ అయ్యానన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వర్తిస్తానన్నారు. సిబ్బందిని సమన్వయం చేసుకుని లక్ష్యాలను సాధించే దిశగా ముందుకెళ్తానని తెలిపారు.

## అంబరాన్నంటిన మొహర్రం సంబరం

4 >>

# విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

**హిందూపురం టౌన్ జులై 07 ప్రభాతవార్త**

విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పి,డి,ఎస్,యు జిల్లా అధ్యక్షుడు బాబావలి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని సోమవారం హిందూపురం పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద మోకాల్లపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న 6400 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని, పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ వర్తించే విధంగా జీవో నెంబర్ 77ని రద్దు చేయాలని, ప్రభుత్వ హాస్టల్స్లో మోలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పై నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని తెలిపారు. సత్యసాయి జిల్లాలో ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు అస్వస్థతకు గురైతే విద్యాశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. షరతులు లేకుండా విద్యార్థులందరికీ తల్లికి వందనం వర్తించే విధంగా చేయాలని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికి స్పందించకపోతే పదవ తేదీ చలవ విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉమేష్ నాయక్, జిల్లా సహాయక కార్యదర్శి భగత్, జిల్లా కమిటీ సభ్యులు అనుదీప్, నాగేంద్ర, సాయిరాం విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్‌బాల్ బాల బాలికల జట్ల ఎంపిక



ఎంపికైన జట్టుతో అసోసియేషన్ సభ్యులు

**హిందూపురం టౌన్ జులై 07 ప్రభాతవార్త**

హిందూపురం పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ మైదానంలో సోమవారం సబ్ జూనియర్ బాల బాలికల ఫుట్బాల్ జట్లను ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఫుట్బాల్ సంఘం అధ్యక్షుడు జే,వి అనిల్ కుమార్, ట్రెజరర్ శేఖర్, కార్యదర్శి మహమ్మద్ సలీం, లోకనాథ్, ఆజాద్, దుర్గాప్రసాద్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# విరబూసిన బ్రహ్మకమలం

**శెట్టూరు, జులై 07 ప్రభాతవార్త**



విరబూసిన బ్రహ్మ పుష్పాలను చూపిస్తున్న దృశ్యం

మండలంలోని లక్ష్మంపల్లి గ్రామంలో గృహమునందు చాలా అరుదుగా వికసించే బ్రహ్మపుష్పం. కనిపించడం జరిగింది. ఈ బ్రహ్మ పుష్పాల ను చూసేందుకు అతని. గృహానికి పోటెత్తారు పలువురు మహిళలైతే ఏకంగా పూజలు చేశారు ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తాను ఈ మొక్కని మైసూరు నుండి తెచ్చానని ఈ మొక్కను నాటి రెండు సంవత్సరాలు అయిందని. నిన్నటి రోజు బ్రహ్మ పుష్పాలు వికసించాయని. అందుకు తనకు చాలా సంతోషం అయిందని మేము రోజు ఈ మొక్కకు పూజలు చేసే వాళ్ళమని తెలియజేశారు.

# నేడు ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ అమరాపురం రాక

**అమరాపురం జూలై 7 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన అమరాపురం నందు సుపరిపాలన తొలి అడుగుకార్యక్రమం లో భాగంగా మంగళవారం ఉదయం 11.00 గంటలకు అమరాపురం, మధ్యాహ్నం 2గంటలకు బసవనపల్లిలో మడకశిర శాసన సభ్యులు ఎం.ఎస్.రాజు,టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామిలు విచ్చేస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్ మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు లు తెలిపారు. కావునమండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు, ఎంపీటీసీలు ,మాజీఎంపీటీసీలు ,జడ్పిటిసి,మాజీ జడ్పిటిసిలు, సర్పంచులు, మాజీ సర్పంచులు ,మండల్ తెలుగుదేశం పార్టీ పంచాయతీ కమిటీ సభ్యులు బూత్ క్లస్టర్ యూనిట్ ఇన్చార్జిలు సర్పంచులు ఉపసర్పంచులు వార్డ్ మెంబర్స్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, ఆయకట్టు అధ్యక్షులు, డైరెక్టర్లు, డీలర్లు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు బిజెపి, జనసేన నాయకులు అధిక సంఖ్యలో రావాలని వారు కోరారు.

# బాధ్యతలు స్వీకరించిన అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్

**కనేకల్లు జూలై 07 ప్రభాతవార్త**



జాయింట్ కలెక్టర్లను సన్మానిస్తున్న ఎమ్మార్వో ఎంపీడీవో

మండల కేంద్రంలోని సచివాలయం ఒకటి నందు సచిన్ రహార్, అసిస్టెంట్ కలెక్టర్ పంచాయతీ కార్యదర్శిగా 14 రోజుల శిక్షణలో భాగంగా,కణేకల్ మేజర్ పంచాయతీ కార్యదర్శిగా సోమవారం బాధ్యతలు చేపట్టారు.అసిస్టెంట్ కలెక్టర్ని తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో విజయసింహా రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ పుష్ప గుచ్చం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వీఆర్వోలు పవన్‌కుమార్, రుద్రప్ప, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, కనేకల్ నాలుగు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ పాఠశాలలో సీటు ఇప్పించండి

**కంబదూరు, జూలై 07, ప్రభాతవార్త**



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థిని తండ్రి

కంబదూరు మండల కేంద్రం లో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రాధాఅనే విద్యార్థిని కి 8వ తరగతిలో ప్రవేశం కల్పించాలని ఆ బాలిక తండ్రి ఉప్పర రమేష్ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నందు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో తహసిల్దార్ బాల కిషన్ ను కోరారు.గత మూడు సంవత్సరాలుగా ప్రతి ఏడాది సీటు కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసున్నానని, ఐతే ఇంతవరకు సీటు రాక పోవడంతో నా కూతురు చదువులు కొనసాగడం కష్టంగా మారిందని, ఆ బాలిక తండ్రి తహశీల్దార్ తో ఆవేదన వెలిబుచ్చారు. సంభందిత శాఖ దృష్టికి తీసుకెళ్లి సీసీటు వచ్చేలా చూస్తానని ఆ బాలిక తండ్రి కి తహశీల్దార్ హామీ ఇచ్చారు.

# ఫిర్యాదులపై నిర్లక్ష్యం తగదు

## జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



ప్రజల సమస్యలను ఆలకిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

**శ్రీ సత్య సాయి జిల్లా, జులై 07, ప్రభాతవార్త ప్రతినిధి :**

ఎంతో నమ్మకంతో తమ సమస్యలు పరిష్కారం అవుతాయని వచ్చే అర్జీదారుల సమస్యలపై ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశపుహాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తోపాటు డిఆర్వోపార్థసారథి,స్పెషల్‌డిప్యూటీకలెక్టర్‌సూర్యనారాయణ,రామ సుబ్బయ్య, ఆర్డీవో సువర్ణలు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ మాట్లాడుతూ, ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్‌కు రాకుండా అర్జీలను పరిష్కరించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భూ సమస్యల పరిష్కారం, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల మంజూరు, పెన్షన్ ల మంజూరు తదితర అంశాలతో కూడిన వినతులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి డివిజన్ నుండి 60, పెనుకొండ44, ధర్మవరం41, కదిరి 27 వినతులు మొత్తం 172 అర్జీలు స్వీకరించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో మొహరం చివరి రోజు వేడుకలు

**కనేకల్లు జూలై 07 ప్రభాతవార్త**



భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు

కనేకల్ మండల కేంద్రంలో సోమవారం చివరి రోజు పీర్ల దేవుళ్ళు బావికి వెళ్లారు. ఈ సందర్భంగా వేకువ జామునే పూల దండలు, పూల చత్రియులతో పీర్ల స్వాములను ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఉదయం నాలుగు గంటల సమయంలో పీర్ల సావిడి వద్ద నుండి పీర్ల స్వాములను ఎత్తుకొని ఊరిలోని అనంతరం పీర్ల స్వాములు ఊరంతా సవారి చేసి మరల పీర్ల చావడి వద్దకు చేరుకున్నారు. మరల ఆరు గంటల సమయంలో పీర్ల చావిడి వద్ద ఉన్న అగ్నికి గుండమ్మలో స్వామివారిలో రంగ ప్రవేశం చేసారు. మరియు సాయంత్రం నాలుగుగంటలకు ప్రాంతంలో అన్ని పీర్లను ఎత్తుకొని ఊరంతా పీర్ల సవారి నిర్వహించారు, అనంతరం స్వాములు చివరకు జలదికి వెళ్లిపోయారు.

# మా పల్లెలో...వంద ఏళ్ల నాటి దారిని మూసేశారు

### -దారి వివాదం పరిష్కరించాలంటూ తహశీల్దార్ ముందు మహిళలు గగ్గోలు

### -పరిష్కరించే వరకు వెళ్లమంటూ భీష్మించి కూర్చున్న దిగువ గంగంపల్లి మహిళలు

**గోరంట్ల, జులై 7 ప్రభాతవార్త**



తహశీల్దార్‌కు దారి సమస్యను వివరిస్తున్న మహిళలు

గ్రామం నుండి పొలాలకు వెళ్లే దారిని మధ్యలో ఒక రైతు దారి స్థలం మాదంటూ అడ్డంగా గోతులు తవ్వేసి రాకపోకలను అడ్డుకుంటున్నాడని ఏకంగా పదుల సంఖ్యలో ఆ ప్రాంత భూముల రైతులకు సంబంధించిన మహిళలు గోరంట్ల పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న గ్రీవెన్స్‌లో తహశీల్దార్ మారుతిప్రసాద్ ముందు గగ్గోలు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం దిగువగంగంపల్లి గ్రామానికిచెందిన ఈశ్వరమ్మ, వెంకటలక్ష్మమ్మ, అలివేలమ్మ, రజిని, లక్ష్మీనరసమ్మ, అనసూయమ్మ, రామలక్ష్మమ్మ తదితర మరో 25 మంది మహిళలు తహశీల్దార్ ముందు ఆవేదన వ్యక్తం చేస్తూ వివరాలు వెల్లడించారు.

**స్పందించిన తహశీల్దార్ :** మహిళల ఫిర్యాదు మేరకు తహశీల్దార్ మారుతిప్రసాద్ స్పందిస్తూ అప్పటికప్పుడే సర్వేయర్ తాతాజీని పిలిపించి ఈరోజే సంఘటన స్థలానికి వెళ్లి డైక్లాట్‌లో వున్న రోడ్డు ప్రకారం రస్తా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఈవిషయంపై ఇరు వర్గాలకు ఖచ్చితమైన నిర్ణయాన్ని తెలియచేయాలని ఆదేశించారు. అయితే ఇప్పటికే ఏడాదికాలంగా ఈ సమస్యపై తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని మాకు ఇక ఓపిక లేదని ఈ సమస్య పరిష్కరించే వరకు ఇక్కడి నుండి వెళ్ళమని మహిళలు అక్కడే భీష్మించి కూర్చున్నారు.

# ఘనంగా మొహరం వేడుకలు

**గుత్తి, జూలై 7 ప్రభాతవార్త**



పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలో సోమవారం మత సామరస్యాలకు ప్రతీకగా మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బారె ఇమామ్, పగ్గాల పీరు, అలే అక్బర్, డాల్ సాహెబ్, చాంద్, తదితర పట్టణ చావడిలో కొలువుతీరిన పీర్లతో పాటుగా, శ్రీపురం,లచ్చానపల్లి గ్రామాలకుచెందిన పీర్లను కోట నుండి చర్చి మీదుగా, పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం గుత్తిఆర్ఎస్ రోడ్డులో వున్న పీర్లబావిలో జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐసురేష్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

# ఘనంగా ముగిసిన మొహరం వేడుకలు.

**కనగానపల్లి జూలై 7 ప్రభాతవార్త**



జలదికి వెళ్తున్న దస్తగిరి, ఒన్నూరు స్వామి పీర్లు

మండల కేంద్రంలో సోమవారం మొహరం వేడుకలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. దస్తగిరి, ఒన్నూరు స్వాముల పీర్లను పూలతో ప్రత్యే కంగా అలంకరించారు. స్వాములవారికి భక్తులు ప్రత్యేక ప్రార్థనలుచేసి చక్కెర చదివింపులుచేశారు. సాయంత్రం పీర్లను చావిడి నుండి గ్రామ విధుల గుండా మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి చెరువు జలదికితీసుకువెళ్లారు. ఈజల్దికార్యక్రమంలో యువకులు, మహిళలు, వృద్ధులు సైతం అలావ్ తొక్కుతూ ఉల్లాసంగా మొహరం పండుగను జరుపుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# కోల్డ్ స్టోరేజ్ లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

**హిందూపురం జులై 7 ప్రభాతవార్త**



అధికారులతో మాట్లాడుతున్న కొండూరు వేణు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

వైసీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణు గోపాల్‌రెడ్డికి చెందిన హిమాని కోల్డ్ స్టోరేజ్ లో సోమవారం మధ్యాహ్నం అనంతపురం నుంచి విజిలెన్స్ అధికారులు వచ్చి తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖకు చెందిన అధికారి వాసు ప్రకాష్, డిసిటిఓ సురేష్ కుమార్, సర్కిల్ ఇన్ స్పెక్టర్ శ్రీనివానులు, సిబ్బంది వచ్చారు. కోల్డ్ స్టోరేజీలో అంతస్తుల వారిగా ఎంత స్టాక్ ఉంది, రికార్డుల నిర్వహణ, వ్యాపారులు, రైతుల వారీగా ఎవరెవరు ఎంత స్టాక్ గిడ్డంగిలో ఉంచారు, లావాదేవీల వివరాలు నమోదు సక్రమంగా ఉన్నాయా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై వేణుగోపాల్ రెడ్డి వివరించారు. తనిఖీలు చేసేందుకు వచ్చిన అధికారులను ప్రభాతవార్త ప్రతినిధి వివరాలు చెప్పాలని కోరగా వారు స్పందించేందుకు నిరాకరించారు. మీడియాకు వివరాలు వెల్లడించే అంశం తమ పరిధిలో ఉండదని విజిలెన్స్ ఎస్పి దీనిపై తదుపరి మాట్లాడతారని వివరించారు.

# నూతన జెపిసి కమిటీ ఏకగ్రీవం



ఎన్నికైన నూతన జెఏసి కమిటీ

**చిలమత్తూరు, జూలై 7 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఎంఆర్‌సిలో జెఏసి సమావేశం మండల ఉపాధ్యాయుల సమక్షంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ విజయవంతంగా నిర్వహించాలనే దిశగా చర్చించారు. అనంతరం నూతన జెఏసి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో గౌరవాధ్యక్షునిగా అలీముల్లా, అధ్యక్షునిగా వి.రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా వి.సుందర్‌రాజు ఎంపికయ్యారు. అలాగే మహిళా అధ్యక్షురాలిగా పద్మావతి, ఉపాధ్యక్షురాలిగా జె.శశికళ బాధ్యతలు స్వీకరించారు.

# లేపాక్షిలో ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**లేపాక్షి, జూలై 7 ప్రభాతవార్త**



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

మండల కేంద్రమైన లేపాక్షి బస్టాండ్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఆర్‌పిఎస్ నాయకులు నారాయణ, పంచాయితీ నరసింహులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఎస్‌సి రిజర్వేషన్ ఒక వర్గం వారే లబ్ది పొంది ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. ఈ నేపథ్యంలో మందకృష్ణ నాయకత్వంలో ఎస్‌సి వర్గీకరణ కోసం నిరంతరం పోరాటం చేసి సాధించారన్నారు. ఈ వర్గీకరణ ఫలాలు ఎస్‌సిల్లో వెనుకబడిన వారు లబ్ధి పొందడానికి అవకాశం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లేపాక్షి సర్పంచు భార్యను పరామర్శించిన వైకాపా నేతలు

**లేపాక్షి, జూలై 7 ప్రభాతవార్త**



సర్పంచు ఆదినారాయణ భార్య రూతమ్మను పరామర్శిస్తున్న వైకాపా నేతలు

లేపాక్షి సర్పంచు ఆదినారాయణ భార్య రూతమ్మ ఇటీవల అనారోగ్యానికి గురైంది. ఆసుపత్రి నుండి ఆమె ఇంటికి వచ్చిందన్న విషయం తెలుసుకున్న వైసిపి నియోజకవర్గ నేత కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ కన్వీనర్ నారాయణ స్వామి, వైకాపా రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి తదితరులు సర్పంచు ఆదినారాయణ స్వగృహానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. వైసిపి మీ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా వుంటుందని వారు సర్పంచు ఆదినారాయణకు తెలిపారు. వారి వెంట పట్టణ వైకాపా అధ్యక్షులు నాగరాజు, మాజీ కౌన్సిలర్ నాగభూషణ్‌రెడ్డి, నాయకులు నవీన్, రావణ్, ఫారూఖ్‌ఖాన్, ఇర్ఫాన్ తదితరులు వున్నారు.

# 80 క్వింటాళ్ల కందులు పంపిణీకి సిద్ధం

### - మండల వ్యవసాయ శాఖ అధికారి శంకర్‌నాయక్

**గోరంట్ల, జూలై 7 ప్రభాతవార్త**



వివరాలు వెల్లడిస్తున్న ఏఓ శంకర్‌నాయక్

మండలవ్యాప్తంగా రైతులకు పంపిణీ చేయాల్సిన కందుల ఫ్రీ మినీకిట్లు పంపిణీకిసిద్ధంగా వున్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి శంకర్ నాయక్ తెలిపారు. ఈసందర్భంగా స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గోరంట్ల మండల రైతులు కందిపంట సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే కందులు 80 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా వున్నాయని తెలిపారు. 80 క్వింటాళ్ల పంపిణీలో భాగంగా ఎల్ఆర్‌జి 105 రకానికిచెందిన 38క్వింటాళ్లు, ఎల్ఆర్‌జి 52 రకానికి చెందిన 42 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా వున్నట్లు తెలిపారు. కందులు కావాల్సిన రైతులు భూమికి సంబంధించిన పాస్ బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు, ఓటిపి కోసం సెల్ ఫోన్ తప్పక తీసుకురావాలని, వేలిముద్రల ద్వారా ఒక పాస్ బుక్‌కు నాలుగు కిలోల బ్యాగు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రధానంగా ఖరీఫ్‌లో ఎవరైతే ప్రభుత్వ సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు తీసుకోలేదో వారికి మొదటి ప్రాధాన్యతగా ఉచిత మినీ కిట్ల కందులను ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. గోరంట్ల మండలానికి దిగుమతి అయిన 80 క్వింటాళ్ల కందుల్లో మండలంలోని 17 సచివాలయాలకు సరఫరా చేశామని ఒక్కో సచివాలయానికి దాదాపుగా 20 క్వింటాళ్లు కేటాయించామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# కలెక్టర్ చేతుల మీదుగా పంటల బీమా పోస్టర్లు విడుదల



పంటల బీమా పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ , డిఏఓ సుబ్బారావు తదితరులు

**పుట్టపర్తి (కల్చరల్), జూలై 07, ప్రభాతవార్త**

ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన (పి ఎం ఎఫ్ బి వై) పథకం క్రింద ఖరీఫ్, 2025 సంవత్సరానికి పంటల బీమాకు నమోదు చేసుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, వ్యవసాయ అధికారి సుబ్బారావులు తెలియజేశారు. సోమవారం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ నందు ఎందుకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విడుదల చేశారు. శ్రీ సత్య సాయి జిల్లాలో దిగుబడుల ఆధారంగా పంటల భీమా కొరకు, కంది, వరి, మొక్కజొన్న, ఆముదం, రాగిపంటల అమలుకుగాను అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కంపెనీ ఎంపిక చేయబడినట్లు తెలియజేశారు. అలాగే, నూతన వాతావరణ ఆధారిత పంటల భీమా పథకంలో జిల్లాలో ప్రత్తి,వేరుసెనగ, దానిమ్మ, బత్తాయి, టమోటా పంటలు ఉన్నాయన్నారు. పైపథకం అమలుకు గాను ఇఫ్కోటోకియో కంపెనీ అమలు చేస్తున్నట్లు తెలియజేశారు.పంటల భీమా పథకంలో రైతులు సొంతంగా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని, రైతులు ప్రీమియం బ్యాంకులో పంట రుణం తిసుకునేటపుడు, భీమా కూడా చేయించు కోవచ్చన్నారు. ఒకవేల రైతుకు ఇష్టంలేకపోతె భీమా చేయించుకోవడం నుండి మినహాయింపు కోరవచ్చు. రైతు ప్రీమియంను జాతీయ పంటల భీమా పోర్టల్ నందు నేరుగాకానీ, మీ సేవా కేంద్రము నందు గాని నామోదు చేసుకోవచ్చని తెలిపారు.ఏకరానికి కంది పంటకు 102 రూపాయలు, వరి పంటకు 200, మొక్క జొన్నకు 165, ఆముదం, రాగి పంటలకు 100 రూపాయలు, ప్రత్తి పంటకు 1900, వేరుసెనగకు 640, దానిమ్మ పంటకు 3750 రూపాయలు, బత్తాయి పంటకు 2750 రూపాయలు, మరియు టమోటా పంటకు 1600 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కావున జిల్లా లోని రైతులు అందరూ పంటల భీమా పథకం లో నమోదు చేయించు కొని, ప్రతీకుల పరిస్థితులలో పంట నష్టాలు వచ్చినపుడు భీమ పరిహారం పొందాలని జిల్లా కలెక్టర్ వారు రైతులందరినీ కోరుతూ, భీమాకు సంబంధంచిన పోస్టర్లను విడిదల చేసారు.

# చట్టపరిధిలో న్యాయం చేయండి జిల్లా ఎస్పీ వి.రత్న

**పుట్టపర్తి, జూలై 07 ప్రభాతవార్త,**



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ వి.రత్న

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ( పిజిఆర్ ఎస్)కు వచ్చిన పిటీషనర్లకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలమూలల నుండీ విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు, డీఎస్పీలు విజయ్ కుమార్, ఆదినారాయణ , లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కువైట్‌లో ఉద్యోగావకాశాలకు దరఖాస్తు చేసుకోండి

**పుట్టపర్తి (కలెక్టరేట్), జూలై 07, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ఎస్ డి సి) మరియు ఓవర్సీస్ మాన్పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఓఎంసిఏపి) వారు థట్ రుయా(https://thatruya.com/) వారి భాగస్వామ్యంతో కువైట్‌లోని నిర్మాణ రంగంలో నైపుణ్య ఉద్యోగాలకోసం అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాల కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ ఒ ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రానికి చెందిన అనుభవజ్ఞులైన నిర్మాణ కార్మికులకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దీనిలోభాగంగా "సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్ లేదా సీలింగ్ వర్క్స్‌లో ఐటిఐ/డిప్లొమా కలిగి ఉండి, 3-5 సంవత్సరాల అనుభవం ఉన్న 25 నుండి 50 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన పురుష అభ్యర్థుల నుండి 2 సంవత్సరాల కాంట్రాక్ట్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలియజేశారు. నెలకు 200 నుండి 250 వరకు కువైట్ దీనార్లు (సుమారుగా ..56,000 నుండి ..70,000 వరకు) జీతం ఉంటుందని, వీసా ప్రాసెసింగ్, విమాన టికెట్లు, వైద్య సదుపాయాలు, నివాసం వంటి ఏర్పాట్లను కంపెనీ వారు చెల్లిస్తారన్నారు.దరఖాస్తుకు చివరి తేదీ: 12 జూలై 2025అని, అభ్యర్థులు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, ఐటిఐ/డిప్లొమా సర్టిఫికెట్, అనుభవం ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని,ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. తమ బయోడేటాను skillinternational apssdc.in కు మెయిల్ చేయవచ్చు లేదా హెల్ప్‌లైన్ నెంబర్ 9988853335 లో సంప్రదించవచ్చు అని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెలియజేశారు.

# బిసిలను కలుపుకుని దండోరా ముందుకెళ్తుంది

**రామగిరి, జులై 7 ప్రభాతవార్త**



ఎమ్మార్పిఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బిసి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలను కలుపుకుని మాదిగదండోరా ముందుకెళ్తుందని ఎమ్మార్పిఎస్ నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని పేరూరు గ్రామంలో సోమవారం ఎమ్మార్పిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీఎంపిపి బడగొర్ల అంజినప్ప, సాగునీటి సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఆవుల ముత్యాలు,నాయకులు వడ్డి సుబ్రహ్మణ్యం, ఇనాయతుల్లా, దండోరా నాయకులు శ్రీరాములు, మాజీ సర్పంచు గంగాధర్, వెల్డింగ్ గంగయ్య, సుబ్బరాయుడు, సీఎం నరసింహులు, కొత్తపల్లి చంద్ర, రబ్బర శ్రీరాములు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మార్పిఎస్ నాయకులు మాట్లాడుతూ.. మనందరం కలిసి సమస్యల పరిష్కారం కోసం ఒకరికొకరు సమన్వయంతో ముందుకెళ్తామన్నారు. బిసిలు, ఎస్టీలకు ఎక్కడైనా అన్యాయం జరిగితే వారికి అండగా దండోరా ఉంటుందన్నారు. ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అందరం నడుస్తామన్నారు. ఏబిసిడి వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేసిన కృషి ఎనలేనిదని అందుకు సీఎం చంద్రబాబునాయుడుతో ఎంత సహకారం అందించి వర్గీకరణకు సహకరించారన్నారు.

